ఫలానా విషయాల మీదకి వెళ్ళద్దని చెప్పినా అవి వెళ్తూంటే అప్పుడు ఆ మనసు స్వతంత్రురాలు కాదని అర్థం. నే చెప్పినట్లు చేస్తే అప్పుడు నీ ఇంద్రియాల మీద నీకు పట్టు వస్తుంది. ఇది ఆధ్యాత్మిక ప్రగతికి అతి ముఖ్యం."

## 53. ఇకనైనా బూట్లు తొడుక్కోండి

చలికాలంలో ఒకతను ఓ ఊరికి వెళ్ళాడు. రైల్వే స్టేషన్ నించి హోటల్‌కి చేరుకునేదాకా చూస్తే ఆ ఊళ్ళో ఎవరి పాదాలకి చెప్పులు కాని, బూట్లు కాని లేకపోవడం అతను గమనించాడు. హోటల్ రిసెప్షనిస్టుకి, కేషియర్‌కి, బెల్ బాయెస్‌కి కూడా బూట్లు లేవు.

మర్నాడు అతను హోటల్ నించి బయటకి వచ్చి చూస్తే మంచు కురిసి ఉంది. కాని రోడ్డు మీద తిరిగే ఎవరి పాదాలకి బూట్లు లేవు. అతను ఒకతన్ని ఆపి అడిగాడు.

"మీకెవరికీ బూట్ల గురించి తెలీదా?"

"ఎందుకు తెలీదు? తెలుసు." జవాబు చెప్పాడు అతను.

"ఇక్కడికి బూట్లు సరఫరా కావా?" మళ్ళీ ప్రశ్నించాడు అతను ఆసక్తిగా.

"ఎందుకు కావు? అదిగో. ఎదురుగా కనబడే ఆ బిల్డింగ్‌లోనే బూట్లు తయారవుతూంటాయి." ఓ పెద్ద భవంతిని చూపించి చెప్పాడు అతను.

"ఈ ఊళ్ళో బూట్లు బాగా ఖరీదా?"

"ఊహు. ఇక్కడే తయారవుతాయి కాబట్టి చవకే."

"అవి మీకు చలి నించి రక్షణ ఇస్తాయని తెలీదా?"

"తెలుసు."

"మరి మీరంతా ఎందుకు బూట్లని వేసుకోరు?"

"ఏమో మరి? మేం ఎందుకు బూట్లని వేసుకోమో నాకు తెలీదు." జవాబు చెప్పాడు అతను.

ప్రార్థన విషయంలో కూడా మనలో చాలామంది పై ఊళ్ళోని బూట్లు వాడని ప్రజల్లాంటి వారే. వారు ఆస్తికులా అంటే కాదు. ప్రార్థన గురించి,

దానివల్ల కలిగే చక్కటి అనుభూతి గురించి తెలీదా అంటే తెలుసు. ప్రార్థన వల్ల దేవుడి అనుగ్రహం, ఆశీర్వాదం లభిస్తాయనీ తెలుసు. తరచు ప్రార్థన విలువ గురించి చదువుతూంటారు, వింటూంటారు.

ఎవరైనా వారిని 'మీరు ఎందుకు ప్రార్థన చేయడం లేదు?' అని అడిగితే వారి దగ్గర సరైన జవాబు ఉండదు.

సూర్యుడు ఉన్నప్పుడు ప్రార్థించని వాడికి మబ్బులు వచ్చి చీకట్లు కమ్మాక అప్పుడు ప్రార్థించడం ఇంకా కష్టమవుతుంది. కనీసం మనమైనా ఆ ఊళ్ళోని బూట్లు తొడుక్కోని ప్రజల్లా కాక, దైవ ప్రార్థన చేసే ఆస్తికులుగా జీవిద్దాం.

## 54. వ్యామోహం

ఓ రోజు ఓ మనిషి ఓ అడవికి వేటకి వెళ్ళాడు. అకస్మాత్తుగా రెండు ఏనుగులు అతని వెంట పడ్డాయి. వాటినించి పారిపోవడానికి అతను ఓ పెద్ద చెట్టుని ఎక్కి దాని కొమ్మల్లో దాక్కున్నాడు. కాని ఏనుగులు అతన్ని పసికట్టి, తమ తొండాలని చెట్టు బోదె చుట్టూ పోనిచ్చి దాన్ని గట్టిగా వూపసాగాయి.

ఆ మనిషి కూర్చున్న చెట్టు పై కొమ్మ మీద ఓ పెద్ద తేనెపట్టు నించి ఆ తాకిడికి తేనె కారసాగింది. ఆ మనిషి ఆనందంగా తేనెని తాగసాగాడు. ఇంతలో తేనెటీగలు అతన్ని చుట్టు ముట్టి కుట్టసాగాయి. ఆ సమయంలో అటుగా ఓ దేవత రథం మీద వెళ్తూ ఆ మనిషి దుస్థితిని చూసి జాలి పడి ఆగింది.

"మిత్రమా! నువ్వు గొప్ప కష్టంలో వున్నావు. వెంటనే నా రథం ఎక్కు. నిన్ను రక్షిస్తాను." దయగా చెప్పిందా దేవత.

"ఒక్క క్షణం ఆగండి. తేనె ఐపోవస్తోంది. తర్వాత వస్తాను."

ఆ దేవత దయతో అతని కోసం కొద్ది సేపు ఆగి, అతను తేనెని తాగాక మళ్ళీ చెప్పింది.

" ఇక రా."

"తేనె ధార ఇంకా ఆగలేదు. దయచేసి మరి కొద్ది క్షణాలు ఆగండి." చెప్పాడు ఆ మనిషి.